ప్రజాశక్తి

శుక్రవారం 25 అక్టోబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

అమరావతి రైల్వేలైనుకు పచ్చజెండా

- ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ తెరపైకి కొత్తలైను
- కృష్ణానదిపై 3.2 కిలో మీటర్ల రైలుబ్రిడ్జి నిర్మాణం
- కేంద్ర కేబినెట్ ఆమోదంతో రాజధానిలో హర్షాతిరేకాలు




రైల్వేలైనుపై మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

దాదాపు ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అమరావతి రైల్వే లైనుకు ఎట్టకేలకు కేంద్ర కేబినెట్ గురువారం పచ్చజెండా ఊపింది. 2016-17 బడ్జెట్‌లో ఈ లైను నిర్మాణానికి ప్రతిపాదించారు. అయితే అప్పట్లో రైల్వేశాఖ తయారు చేసిన డిపిఆర్ ప్రకారం డబల్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.2685 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. అంతేగాక రాజధాని గ్రామాల్లో జనసాంద్రత పెరగడం లేదని, ఇప్పటికిప్పుడు రైళ్లు నడిపితే నష్టాలు వస్తాయని రైల్వేశాఖ అధికారులు 2017లో అంచనాలు వేశారు. ఏడాదికి రూ.600 కోట్ల వరకు నష్టం వస్తుందని, ఈ నష్టంలో సగం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరింది. అంతేగాక రాజధాని గ్రామాల పరిధిలో మొత్తం 686 ఎకరాల భూములను కేటాయించాల్సి ఉందని రైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అయితే నష్టం విషయంలో సగం సొమ్ము భరించేందుకు అప్పట్లో టిడిపి ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో 2016-17 నుంచి మూడేళ్ల పాటు ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు పూర్తిగా అటకెక్కింది. ఈ ప్రాజెక్టును జీవంలో ఉంచేందుకు ఏటా బడ్జెట్‌లో రూ.లక్ష వరకు కేటాయింపులు చేసిన రైల్వేశాఖ దాదాపు 8 ఏళ్లతరువాత మళ్లీ ప్రాజెక్టుకు

▶ 2లో



ప్రతిపాదిత రైల్వే లైను మ్యాప్

రైల్వే లైనుకు రూ.2245 కోట్లు

రాజధాని అమరావతి ప్రాంతంలో నూతనంగా రైల్వేలైను నిర్మాణం కోసం కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదించిందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ రైల్వే లైను నిర్మాణం పూర్తయితే దేశంలోని అన్ని ప్రాంతాలకూ అమరావతితో అనుసంధానం ఏర్పడుతుందన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లా నంబూరుకు కొత్తలైను ఏర్పాటవుతుందన్నారు. ఈ లైను నుంచి అటు హైదారాబాద్, ఇటు చెన్నై, బెంగుళూరు, హౌరా లైన్లకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. రాబోయే కాలంలో రాజధాని ప్రాంతంలో ఏర్పాటయ్యే పరిశ్రమలు, విద్యా, వైద్య సంస్థలకు ఈ లైను ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రైల్వేలైను ఏర్పాటైతే సామాన్యుల నుంచి ఉన్నత వర్గాలకు ఉపయోపడుతుందన్నారు. కృష్ణా నదిపై 3.2 కిలో మీటర్ల మేర రైల్వే వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. తొలిదశలో రూ.2,245 కోట్లతో 57 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు 19 లక్షల పనిదినాలతో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తుందన్నారు.

పల్నాడులో డయేరియా కాటు

- రెండుకు చేరిన మృతుల సంఖ్య
- తాగునీటి కాలుష్యమే కారణమా?



వార్త మెయిన్‌లో

డ్రెయినేజీ కాల్వ పక్కనే ఉన్న బోరు... ఈ బోరు నుండే అంజనాపురానికి తాగునీరు సరఫరా



మాట్లాడుతున్నపాశం రామారావు

సమస్యలపై 8-15 తేదీల్లో ప్రజాపోరు

ప్రచార యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చేనె 8వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరిగే ప్రజాపోరు ప్రచార యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో రామారావు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలపై అత్యాచారాలు, తదితర సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచార యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందని, క్రిమినల్ చట్టాల్లో మార్పులు తెచ్చి ప్రతిపక్షాలు, ఉద్యమకారులపై నిర్బంధాన్ని పెంచుతోందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలని,

▶ 2లో



సాగర్‌కు పెరిగిన వరద

ప్రాజెక్టు 20 క్రస్టుగేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్ జలాశయానికి గురువారం వరద ఉధృతి పెరగడంతో ప్రాజెకు 20 క్రస్టు గేట్లను ఐదు అడుగుల మేర పైకి ఎత్తి 1,62,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయానికి 2,10,149 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా అదేమొత్తంలో నీటిని దిగువకు వదిలేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం కూడా అదేస్థాయిలో ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలకు గాను ప్రస్తుత నీటి నిల్వ అదేస్థాయిలో ఉంది. జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పతి కొనసాగుతోంది. పులిచింతలకూ వరద ప్రవాహం పెరిగింది. శుక్రవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజికి కూడా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉంది.

రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

8లో

యువజనోత్సవంలో నాట్య మయూరాలు





గ్రూప్ సాంగ్ విభాగంలో ప్రతిభా ప్రదర్శన



ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో యువజనోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వర్సిటీలోని ఓపెన్ ఆడిటోరియంలో మ్యూజిక్, థియేటర్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు పోటీపడి మరి ప్రదర్శనలిచ్చారు. క్లాసికల్ డాన్స్‌లో అలనాటి మేటి చిత్రాల్లో ప్రముఖ నర్తకీమణులు నృత్యం చేసిన పాటలకు నేటి యువత అడుగులు కదపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మేకప్, వస్త్రధారణ, హావభావాలు, పెర్ఫార్మెన్స్ వంటి అన్ని విషయాలలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. తొలిరోజు పోటీల్లో భాగంగా క్లాసికల్, ఇంస్ట్రుమెంటల్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్టర్న్ లోకల్, సోలో, వెస్టర్న్ గ్రూప్ సాంగ్‌లలో విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. మిమిక్రీ అయితే నేరుగా సినిమాలు, సీరియల్‌లో నటన చూస్తున్నట్లుగానే ప్రదర్శన సాగింది. హావభావాలతో విద్యార్థులు పడ్డ కష్టానికి చప్పట్ల రూపంలో అద్భుత స్పందన ప్రతిఫలంగా దక్కింది. పోస్టర్ మేకింగ్, స్పాట్ పెయింటింగ్‌లో విద్యార్థులు సృజనాత్మకతకు పదునుపెట్టారు. వికాస భవన్, విద్యార్థి కేంద్రం, దక్షిణామూర్తి సెమినార్ హాల్, బాలమోహన్ దాస్ సెమినార్ హాల్, ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో జరిగిన ఆయా పోటీల్లో ఉత్సాహవంతంగా పోటీలు సాగాయి. కార్యక్రమాలను యువజనోత్సవాల కో-ఆర్డినేటర్ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షించారు.

ఓటు దరఖాస్తులు సమగ్రంగా విచారణ చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటు దరఖాస్తులను సమగ్రంగా విచారించాలని బిఆర్ఎఒలను తహశీల్దార్ కెఎస్ చక్రవర్తి ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ విచారలో డిగ్రీ సర్టిఫికెట్‌లు పరిశీలించాలన్నారు. ఇంటర్మీడియట్ అనంతరం డిప్లొమా చదివిన వారు, డిస్టెన్స్‌లో డిగ్రీ చదివిన వారు కూడా ఎమ్మెల్సీ ఓటు హక్కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. సమావేశంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లస్-2 పాఠశాలలో పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని జెడ్‌పి ప్లస్-2 పాఠశాలను పల్నాడు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి (డివిఇఒ) ఎం.నీలావతిదేవి గురువారం సందర్శించారు. బోధనా తీరును పరిశీలించి ఇంటర్ విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడారు. సిఆర్, ఎఎంజి కాలేజీ ఏదో ఒకదానిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులకు ప్రాక్టికల్స్ అవకాశం కల్పిస్తామన్నారు. నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. సొంత ఖర్చులతో విద్యార్థినులకు యూనిఫారంను అందించిన పిజిటి టీచర్లను అభినందించారు.

సమస్యలపై 8-15 తేదీల్లో ప్రజాపోరు

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ ఛార్జీలను పెంచే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా నియంత్రించాలన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు సమస్య సుదీర్ఘకాలంగా ఉందని, ప్రభుత్వాలు మారుతున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని విమర్శించారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు అవసరమైన నిధులను కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు. నల్లమడ వాగు ఆధునీకరణ పనులు పూర్తి చేసి వరద ముంపు సమస్య నివారించాలన్నారు. రబీ సీజన్లో రైతులకు అవసరమైన శనగ, మొక్కజొన్న విత్తనాలను సబ్సిడీ మీద అందించాలని, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు తగినంతగా అందుబాటులో ఉంచాలని కోరారు. భూరీసర్వేలో వచ్చిన సమస్యలను ప్రస్తుతం జరుగుతున్న రెవిన్యూ గ్రామసభల్లో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు కె.వెంకటశివరావు, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, సిహెచ్.యానాదులు, కె.వెంకట సుబ్బారావు, ఎన్.రాజేంద్ర, పి.సలీం, షేక్ షమీ, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

తక్కువ ధరకే వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు పిల్లల దరిచేరవని డాక్టర్ కొనకంచి రమేష్‌బాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజన్ ఐఐటి, విద్యాకేంద్రం, లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన వ్యాది నిరోధిక శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాదులతో పాటు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాదులు పీడిస్తున్నాయని చెప్పారు. పిల్లలు వీటి బారిన పడి తీవ్రంగా బాధపడుతున్నారని చెప్పారు. వ్యాధుల నుండి పిల్లలకు రక్షణ కోసం ముందస్తు టీకాలు వేశారు. క్లబ్ అధ్యక్షులు మాతంగి సాంబశివరావు మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలు అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నామని, తక్కువ ధరకే టీకాను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వి.నాగేశ్వరావు, ఎస్.రమాదేవి, కె.నాగేశ్వరావు, వెంకటేశ్వశరావు, డాక్టర్ అయోధ్య కృష్ణ, విజన్ స్కూల్ డైరెక్టర్ హనుమారెడ్డి, విద్యాకేంద్రం ప్రిన్సిపాల్ నారాయణ, లిటిల్ ఏంజిల్స్ డైరెక్టర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.




అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి శ్రీవాసవికన్యకాపరమేశ్వరి దేవస్థానం సమీపంలోని అమరజీవి అయిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ధ్వంసం చేయటంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విగ్రహాన్ని స్థానిక మెయిన్ బజార్‌లో గతంలో ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు విస్తరణ సమయంలో రోడ్డుకు అడ్డంగా ఉందని తొలగించి కొంతకాలం స్థానిక గ్రామ కచేరి నందు, మరికొంతకాలం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంచారు. ఈ నేపథ్యంలో కొందరు ఆర్యవైశ్య ప్రముఖులు గ్రామపంచాయతీలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్దు ఏర్పాటు చేశారు. నూతన విగ్రహం ఏర్పాటు నిమిత్తం మెయిన్ బజార్ నందు ప్లాట్ ఫారం నిర్మించి సంవత్సరాలు గడిచినా విగ్రహం నెలకొల్పా లేదు. ఇటీవల జరిగిన ఆర్యవైశ్యుల సమావేశంలో మెయిన్ బజార్ ఫ్లాట్ ఫారం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సమావేశంలో నాయకులు ప్రకటించారు. ఇంతలో ఆలయ కమిటీ ఈ విగ్రహాన్ని ధ్వంసం చేయటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్ఆర్ఎం విద్యార్థులకు సిఎం ప్రోత్సాహక బహుమతి



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ విద్యార్థులను సిఎం చంద్రబాబు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ మరియు కేంద్ర పౌర విమానయాన శాఖలు సంయుక్తంగా సోమ, మంగళవారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి డ్రోన్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రదర్శించిన డ్రోన్ టెక్నాలజీ ఎగ్జిబిషన్ను తిలకించి ప్రశంసలు కురిపించారు. మల్టీ స్పెక్ట్రల్ ఇమేజింగ్, మెషీన్ లెర్నింగ్, డ్రోన్ టెక్నాలజీలను అనుసంధానం చేసి సరస్సులు, నదుల్లోని నీటి నాణ్యతను గుర్తించే శాస్త్ర సాంకేతికతను విద్యార్థులు తయారు చేసి డ్రోన్ సమ్మిట్ ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రాజెక్టు వివరాలను తెల్సుకున్న ముఖ్యమంత్రి విద్యార్థులు నిత్య, సుమయఅమ్రీన్, హితేశ్వరరాజులను అభినందించారు. రూ.50 వేల నగదు బహుమతిని కూడా అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రణవ్ పెద్దింటి, డాక్టర్ హరీష్ ఈ ప్రాజెక్టుకు మెంటార్లుగా వ్యవహరించారు. విద్యార్థులను వీసీ మనోజ్ కుమార్ అరోరా, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రవితేజ అభినందించారు.



క్రోసూరులో పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం

ప్రజాక్తి - క్రోసూరు : స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓట్ల నమోదు కేంద్రాన్ని యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి కె.ప్రకాష్‌రావు గురువారం ప్రారంభించారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల పరిధిలోని పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకొనుటకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వివరాలకు 9014422708, 9573855173, 9440856030 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి లక్ష్మణరావు, రామాంజనేయులు, రామకృష్ణ, సత్యనారాయణ బాషా, శ్రీనివాసరావు, జి.రవిబాబు, టి.హనుమంతరావు, శివ పార్వతి, జయలక్ష్మి, వెంకటేశ్వర్లు గోపికృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నియోజకవర్గంలోని పలువురు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక తన నివాసంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన షేక్ నాగూర్ సుభానికి రూ.1,67,400, మండలంలోని వేలూరుకు చెందిన కట్టా అరుణ కుమారికి రూ.2,17,200, బొప్పూడికి చెందిన గుంటూరు సులోచనకు రూ.1,08,600, పూసల హరిబాబుకు రూ.2,17,200, యడ్లపాడుకు చెందిన సోమరాజు సుబ్రమణ్యంకు రూ.లక్ష, జగ్గాపురానికి చెందిన కారసాల బ్లెస్సీకి రూ.2.20 లక్షలు, నాదెండ్లకు చెందిన కొరివి రాజమ్మకు రూ.2,17,200, తుబాడుకు చెందిన షేక్ ముబీనా కుమార్తెకు రూ.1.20 లక్షల చెక్కులను అందించారు.

ఆహార భద్రతపై శిక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వ్యాపారులు ఆహార భద్రతపై తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ కలకండ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తూ పరిశుభ్రమైన, నాణ్యమైన, హానికరంకాని ఆహార ఉత్పత్తులు ప్రజలకు మంచిగా అందించి ఆరోగ్యవంతమైన, సమాజాన్ని నిర్మించాలని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ఫుడ్ సేఫ్టీ ట్రెనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆహారం అమ్మే ప్రతీ ఒక్క వ్యాపారస్తులు, రెస్టారెంట్స్, హోటల్స్, కిరాణా దుకాణాలు, బేకరి, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, కూల్ డ్రింక్స్ అండ్ టీ షాప్స్, సూపర్ మార్కెట్, కూరగాయల వ్యాపారస్తులు, చికెన్ అండ్ మటన్ షాప్స్ తో సహా ఆహారం అందించే ప్రతీ ఒక్క వ్యాపారస్తుడు తప్పనిసరిగా ఆహార భద్రత పై శిక్షణ పొందాలన్నారు.

సిజిజిబి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని సొలసలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. బ్యాంకు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఈదర రాంబాబు శిబిరాన్ని ప్రారంభించగా గుంటూరు శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు చెందిన గుండె వైద్యులు, రామలింగరెడ్డి మాక్సివిజన్ హాస్పిటల్‌కు చెందిన కంటి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్యాంకు విజిలెన్స్ ఆఫీసర్ విజయ్ కుమార్, పల్నాడు ప్రాంతీయ మేనేజర్ పర్ల శ్రీనివాస్, చీఫ్ మేనేజర్ డి.రామబ్రహ్మం, కో-ఆర్డినేటర్ జగదీష్, సొలస బ్రాంచ్ మేనేజర్ కొండేపాటి ప్రణీత్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులపై కోతుల దాడి

ప్రజాశక్తి దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థినులపై గురువారం కోతులు దాడి చేసి గాయపరిచాయి. అల్పాహారం సేవించిన అనంతరం విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి వెళుతుండగా కోతుల గుంపు వారిపై దాడి చేసింది. దీనితో ఎనిమిదో తరగతి విద్యార్థిని శోభారాణి పదో తరగతి విద్యార్థిని నందిని గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే స్థానిక తహశీల్దార్ ఐ సునీత పోలీసులకు సమాచారం అందించారు. వారు విద్యార్థులను వెంటనే తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం తహశీల్దార్ స్వయంగా హాస్టల్‌కి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి బాలికలను పరామర్శించారు. డాక్టర్లు తెలిపిన తేదీల ప్రకారం విద్యార్థులకు వ్యాక్సిన్లు వేయించాలని వార్డెన్ ఆదేశించారు. బాలికల సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే కలెక్టర్‌కు నివేదికను పంపించారు. మళ్లీ ఇటువంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్‌ను తహశీల్దార్ ఆదేశించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీఅనిత హాస్టల్‌కి వెళ్లి బాలికలను పరామర్శించారు.

అమరావతి రైల్వేలైనుకు పచ్చజెండా



(మొదటి పేజీ తరువాయి)

పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.2245 కోట్లు కేటాయించింది. ఈ మేరకు గురువారం నిర్వహించిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపారు.

ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి రాజధాని గ్రామాలను కలుపుతూ నంబూరు వరకు కొత్త లైను ఏర్పాటుకు ఆమోదించారు. ఈ లైను ద్వారా అటు హైదరాబాద్, ఇటు చెన్నై, హౌరా, బెంగుళూరు మార్గాలకు అనుసంధానం చేస్తారు. దీంతో అమరావతి నుంచి దేశంలోని అన్ని మార్గాలకు రైల్వే అనుసంధానం ఏర్పాటవుతుంది. అమరావతి రైల్వే లైను నిర్మాణంతో దక్షిణ, ఉత్తర, మధ్య భారత్‌తో అనుసంధానం ఏర్పడుతుంది. అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వరస్వామి ఆలయం, ధాన్యబుద్ధ ప్రాజెక్టుకు వెళ్లే వారికి రవాణా వసతి మెరుగుపడుతుంది. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను కూడా ఈ లైనుకు అనుసంధానం చేయనున్నారు. విజయవాడ-కాజీపేట మార్గంను కలుపుకొని ఖమ్మం జిల్లా ఎర్రు పాలెం వద్ద నూతన రైల్వే లైను ప్రారంభం అవుతుంది. ఈ మార్గంలో మోటుమర్రి నుంచి విష్ణుపురంకు వయా జగ్గయ్యపేట మీదుగా ఇప్పటికే ఒక లైను ఉంది. ఈ లైనుకు కూడా అనుసంధానం చేస్తారు. ఎర్రుపాలెం నుంచి పెదాపురం, చిన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు, నంబూరు వరకు కొత్త లైను ఏర్పాటు అవుతుంది. ఈ మార్గంలో చిన్నారావుపాలెం నుంచి వడ్డమాను వరకు బ్రిడ్జిని ఏర్పాటు చేస్తారు. నంబూరు నుంచి గుంటూరు మీదుగా నల్లపాడు, నర్సరావుపేట మార్గంతో అనుసంధానం అవుతుంది. మరోవైపు నంబూరు నుంచి కృష్ణాకెనాల్ మీదుగా విజయవాడకు, విజయవాడ నుంచి ఇతర ప్రాంతాలకు అనుసంధానం చేస్తారు. నల్లపాడు నుంచి బిబినగర్ లైనుకు అనుసంధానం చేయనున్నారు. విజయవాడ నుంచి విశాఖ-హౌరా, మచిలీపట్నం పోర్టుకు లైనుతో అనుసంధానం చేపడతారు. మొత్తంమీద దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఈ ప్రాజెక్టు నిర్మాణం పట్టాలు ఎక్కనుంది. దీంతో అమరావతి రైతుల్లో హర్షాతికేరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు సంబంధించి భూసేకరణ చేపట్టేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజను ప్రత్యేక అథారిటీగా నియమించారు.



మాజీ మంత్రి ఆలపాటి ఆద్వర్యంలో పెమ్మసానిని కలసిన వ్యాపారులు

వ్యాపారులకు నష్టం కలిగించం

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం పై కేంద్ర మంత్రి పెమ్మసాని హామీ

ప్రజాశక్తి - గుంటూరు ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ వద్ద నిర్మించే రైల్వే ఓవర్ బ్రిడ్జి వల్ల వ్యాపారులకు, స్థానికులకు నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు తాము మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో కలసి కేంద్ర మంత్రి పెమ్మసానికి తమ సమస్యలను వివరించామని వాటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు గుంటూరు బ్రాడిపేట, అరెండెల్ పేట ఓనర్స్ అండ్ షాప్ కీపర్స్ అసోసియేషన్ నాయకులు నడింపల్లి గురుదత్ గురువారం మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్నపరిస్థితుల్లో బ్రిడ్జినీ సింగిల్ పిల్లర్ ద్వారా నిర్మించాలని, బ్రిడ్జి పై ట్రాఫిక్‌ను తగ్గించేందుకు బ్రాడిపేట 14వ అడ్డరోడ్డు వద్ద రైల్వే గేట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరామన్నారు. అసోసియేషన్ నాయకులు మట్టుపల్లి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వ్యాపారులకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల తమకు నష్టం లేకుండా చూడాలని కోరారు. డొంక రోడ్డు మూడు వంతెనల మార్గాన్ని విస్తరించాలన్నారు. నాయకులు ఎం. హరీష్, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి ఇతర అధికారులు

నేటి నుండి జిల్లాలో 21వ పశుగణన

6.80 లక్షల గృహాల నుండి విషయ సేకరణ

ప్రజాశక్తి-గుంటూరు : పశు సంవర్ధక రంగంలో భవిష్యత్ ప్రణాళిక, విధాన రూపకల్పన కోసం నిర్వహిస్తున్న 21వ అఖిలభారత పశుగణన కోసం గృహాలకు వచ్చిన విషయ సేకరణదారులకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చి ప్రజలందరూ సహ కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో దేశవ్యాప్తంగా అక్టోబర్ 25 నుండి, 2025 ఫిబ్రవరి 28 వరకూ జరగనున్న పశు గణన కార్యక్రమం ప్రచార పోస్టర్లను, స్టిక్కర్లను కలెక్టర్ నాగలక్ష్మి జేసీ భార్గవ్‌తేజతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధులు మెరు గుపరచటానికి దేశవ్యాప్తంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పశు గణన చేయటం జరుగుతుందని, ఇప్పటికి 20 సార్లు పశుగణన జరిగిందన్నారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాదాపు 6,80,800 గృహాల వద్దకు విషయ సేకరణదారులు వెళ్ళి పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వివిధ రకాల కోళ్ళు పక్షుల తో సహా 16 రకాల పెంపుడు జంతువులు, వీధి శునకాలకు సంబంధించి జాతుల వారీగా సమాచారాన్ని సేకరిస్తా రన్నారు. నేషనల్ డైరీ డెవలప్ మెంట్ బోర్డ్ (ఎన్ డీ డీ బీ) భాగస్వామ్యంతో భారత ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఆండ్రాయిడ్ అప్లికేషన్‌ను ఉపయోగించి ఈ పశు గణన ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారన్నారు. దీని కోసం జిల్లాలో 185 మంది పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రాలు, పారా సిబ్బందిని విషయ సేకరణదారులుగా గుర్తించి నట్లు చెప్పారు. వీరిపై డిప్యూటీ డైరక్టర్లు, పశు వైద్యులు 50 మందిని పర్యవేక్షకులుగా నియమించా మన్నారు. విషయ సేకరణదారులు తమ వద్ద ఉన్న పశువులు, కోళ్ళ సంఖ్యపై సరైన సమాచారాన్ని వారికి అందించాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీఏ నర్సింహారావు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం పశుగణనను జిల్లా లోని ప్రజాప్రతినిధులు, ముఖ్య అధికారుల గృహాల్లోని పశువులు, పెంపుడు జంతువుల గణనతో లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. పశుగణనకు సంబంధించిన విషయ సేకరణదారులకు గుర్తింపు కార్డులు అందంచా మని ప్రజలు సహకరిం చాలని కోరారు. కార్యక్రమ ంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ కేవీవీ సత్యన్నా రయణ, అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ ఎల్.నాగేశ్వరరావు, నోడల్ అధికారి డాక్టర్ కె.శివయ్య పాల్గొన్నారు.

పంచాయతి కార్యదర్శిపై చర్యలకు కోర్టు ఆదేశం

ప్రజాశక్తి - తెనాలి

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించటం, ప్రభుత్వ ఆస్థిని పరిరక్షించడంలో అలక్ష్యం చేసిన పంచాయతి కార్యదర్శిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. న్యాయశాఖ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామంలోని కొంత పోరంబోకు స్థలానికి సంబంధించి అదే గ్రామానికి చెందిన ఊసా శివనాగేశ్వరరావు 2020లో పొజిషన్ సర్టిఫికెట్ పొందాడు. దీనిని గ్రామంలోని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు స్థలంపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూడాలని శివనాగేశ్వరరావు, ఊసా రాజేష్ 2020 సంవత్సం ంలో తెనాలి ప్రిన్సిపల్ సివిల్ కోర్టు (జూనియర్ డివిజన్)ను ఆశ్రయించారు. అదే గ్రామానికి చెందిన గాజుల వీరాంజ నేయులు, చావలి గ్రామ పంచాయతిని ప్రతివాదులుగా పేర్కొ న్నారు. ఈ నెల 5వ తేదీన కేసు విచారణకు రావడంతో న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. 2020లో పని చేసిన పంచాయతి కార్యదర్శి కేసు విచారణ సందర్భంగా కోర్టుకు హాజరై పొంతన లేని సమాధానం చెప్పటం, సంతకం తనది కాదని సదరు కార్యదర్శి చెప్పనట్టు కోర్టు రికార్డు చేసింది. ఈ నేపథ్యంలో పంచాయతి కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది.



ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉచిత ఇసుక హామీ నెరవేర్చాలని సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఏరియా భవన నిర్మాణ కార్మికుల సమావేశం మల్కాపురంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా భాగ్యరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక ఇస్తామని, భవనిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, క్లెయిమ్ లు అయ్యేవిధంగా కృషి చేస్తామని చెప్పినప్పటికీ నేటికీ అమలు కాలేదన్నారు. తక్షణమే భవన నిర్మాణ బోర్డును పున రుద్ధంచాలని, రాజధాని నిర్మాణంలో స్థానిక భవన నిర్మాణ కార్మి కులను భాగస్వామ్యం చేసే విధంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చెంచయ్య, పూర్ణచంద్రరావు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి సంధానకర్త మీడియా : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు



సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు చేరవేయడంలో, ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయటంలో మీడియా సంధానకర్తగా ముఖ్యభూమిక పోషి స్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి), విజయవాడ ఆధ్వర్యంలో గుంటూరులో గ్రామీణ, జిల్లా పాత్రికేయులకు నిర్వహించిన వార్తాలాప్ మీడియా వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా, గ్రామీణ స్థాయిల్లో పనిచేస్తున్న పాత్రికేయులు ప్రజల్లో సానుకూల దృక్పథం కల్గించే వార్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సిద్దార్థ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి హెచ్.దివాకర్‌బాబు మాట్లాడుతూ ఇటీవల సవరించిన క్రిమినల్ చట్టాల్లో చేసిన మార్పులను వివరించారు. 'హిందూ' ఆంగ్ల దినపత్రిక సీనియర్ కరస్పాండెంట్ ఎం. సాంబ శివరావు మాట్లాడుతూ మీడియాలో సమతుల్యత కలిగిన వాస్తవ వార్తలకు అధిక ప్రాధా న్యత ఇవ్వాలని అన్నారు. పరి శోధనాత్మక వార్తలు దాదాపుగా కను మరుగయ్యాయని, సంచలనాత్మక వార్తలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం శోచనీయమని అభిప్రాయపడ్డారు. సంచలనాలకు ఒక వేదికగా సోషల్ మీడియా మారుతున్న ప్రస్తుత తరుణంలో పాత్రికేయులు మరింత అప్రమత్తత కలిగి తమ బాధ్యతలను నిర్వర్తించాలని అన్నారు. సమాచార హక్కు చట్టం, వినియో గదారుల రక్షణ చట్టంపై 'జనం' సహాయ సంపాదకులు కె.వెంకటరమణ ప్రసంగించారు. అసిస్టెంట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వివిధ ప్రజాసంక్షేమ పథకాల గురించి తెలియ జేశారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆంధ్రప్రదేశ్ రీజియన్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి మాట్లాడుతూ పిఐబి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. పాత్రికేయుల వృత్తి నైపుణ్యం పెంచే దిశగా రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఆకాశవాణి, దూరదర్శన్ అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

దావాసమనులు

మహా రాజశ్రీ తెనాలి సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.44/2019

Between:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దుగ్గిరాల బ్రాంచ్, దుగ్గిరాల, గుంటూరు జిల్లా,
రిప్రెజెంటెడ్ బై బ్రాంచ్ మేనేజర్ .... వాది

మరియు

శ్రీ లక్ష్మి రైతుమిత్ర గ్రూప్, కె, ఆర్. కొండూరు
రిప్రజెంటెడ్ బై కన్వీనర్, కో-కన్వీనర్
మరియు ఇతరులు ...ప్రతివాదులు

To

R15. కత్తిక హేమ చంద్రరావు,
తండ్రి వెంకట రమణ (లేటు),
R16. కత్తిక భరత్ కుమార్,
తండ్రి వెంకట రమణ (లేటు),
R17. కత్తిక అనిత, భర్త వెంకట రమణ (లేటు),
R15, R16, R17 అందరి నివాసం :
జె.హనుమంతరావు హాస్పటల్ దగ్గర, గంగానమ్మ పేట, తెనాలి, గుంటూరు జిల్లా.
R18. దూల సీతారావమ్మ, భర్త:సాంబశివరావు,
R19. దూల కోటేశ్వరమ్మ, భర్త: గోపి ప్రసాద్ (లేటు),
R18, R19 అందరి నివాసం : డోర్ నెం. 1-37,
సాయిబాబా గుడి దగ్గర, కె.ఆర్.కొండూరు,
దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.
R 20. కొత్తమాసు కనక దుర్గ,
భర్త: రాజేంద్రప్రసాద్ (లేటు), కె.ఆర్.కొండూరు,
దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.
R 22. యేడ్లూరి మైద, భర్త:లక్ష్మయ్య (లేటు),
అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, చందన లేడిస్ హస్టల్,
మాచవరం.

పై నంబరు దావాలో ప్రతివాదులు డి15 టు డి20 అండ్ డి22 అయిన మిమ్మల్ని ప్రతివాదులుగా చేర్చి పలుమార్లు శ్రీకోర్టువారి ద్వారా దావా సమనులు పంపించినను అందుకొనక కాలయాపన చేయుచున్నం దున శ్రీకోర్టువారు మీకు దావా సమనులు ఈ వార్తాపత్రిక ద్వారా సమనులు అందజేయడమైనది. పై తెలిపిన దావా నెం. 44/2019, ది.07-11-2024న మీ హాజరుకు వాయిదా అయివున్నది. కావున సదరు తేదీన ఉదయం 10.30ని.లకు మీరు స్వయంగాగానీ న్యాయవాది ద్వారాగానీ సదరు కోర్టు నందు హాజరై మీకుగల ఆక్షేపణలు తెలియ జేసుకోవలసినదిగా లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా తేది: 07-11-2024
ఉదయం 10-30 ని॥లకు

మంగళగిరి,
ది.25-10-2024

వాకా రామగోపాల్ గౌడ్,
వాది తరుపున న్యాయవాది,
మంగళగిరి. సెల్: 9848116475.

దావా సమను

మహారాజశ్రీ సివిల్ జడ్జివారి కోర్టులో
(జూనియర్ డివిజన్), సత్తెనపల్లి.
ఓ.యస్.నెం. 926/2022

బిట్వీన్ :
గనుపల్లి రాజశేఖర్ బాబు ..... వాది

మరియు

గోళ్ల అరుణ్‌కుమార్ .... ప్రతివాది

ప్రతివాది : గోళ్ల అరుణ్కుమార్, తండ్రి రవి కుమార్, నివాసము డోరు నెం. 95-11-334, మున్సిపల్ కార్పోరేషన్ అప్పర్ ప్రైమరీ స్కూల్ -64 ఎదరు, 5వ లైన్, శివరాం నగర్, గుంటూరు టౌన్ & మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో పై కోర్టువారు నీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచూ యిబ్బందులు కలుగజేయుచున్నందున నీకు సమనును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తము ఈ దావాను తేది 28-10-2024 నకు వాయిదా వేశారు. కావున నీవు ఆ తేదీన ఉదయం గం.10.30 గం॥ లకు పై కోర్టువారి ఎదుట స్వయముగాగానీ, వకీలు ద్వారాగాని హాజరై పైదావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని యెడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వాయిదా తేది: 28-10-2024

వి. పాపారావు
వాది తరపు న్యాయవాది, సత్తెనపల్లి.

తాడేపల్లిలో 'రమేష్ స్పెషాలిటీ' సేవలు


ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజలకు మేలైన వైద్య సేవలు తాడేపల్లి పట్టణంలో ఆస్టర్ రమేష్ స్పెషాలిటి క్లినిక్స్ ద్వారా అందించనున్నట్లు చైర్మన్ ఎం ఎస్ రామ్మోహన్ రావు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి రమేష్ బాబు గురువారం తెలిపారు. తాడేపల్లి బైపాస్ రోడ్ లోని హెచ్డి ఎఫ్ సి బ్యాంకు సమీపంలో నవంబర్ మూడో తేదీ నుండి తమ హాస్పిటల్లో వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. అత్యవసర కేసులు అన్ని వేళల చూడబడతాయని తెలిపారు. ప్రతి మంగళవారం ఉచితంగా ఎంతమంది రోగులు వచ్చిన ఔట్ పేషెంట్ విభాగం నిర్వహిస్తామని వివరించారు. తమ క్లినిక్స్ లో గుండె, నరాలకు సంబంధించిన వ్యాధులతోపాటు ఎముకలు, ఊపిరితిత్తులు, షుగర్, బిపి వ్యాధులకు నిష్టాతులైన వైద్యులు సేవలు అందిస్తారని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా గైనకా లజిస్ట్ డాక్టర్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలి పారు. తాడేపల్లి, మంగళగిరి, రాజధాని అమరావతి తదితర ప్రాంతాల ప్రజలు తమ ఆసుపత్రి వైద్య సేవలు పొందవచ్చు అని సూచించారు.

వరద బాధితులకు విశ్వబ్రాహ్మణ సమాజం విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు నేతృత్వంలో నగరంలోని దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజంతోపాటు, ప్రముఖులు వరద బాధితుల కోసం రూ.1.90లక్షల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అందజేశారు. సిఎంను కలిసిన వారిలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి కె.వెంకటభాస్కరరావు, దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం కార్యదర్శి మేడూరి శివరామకృష్ణ, యు.నాగేశ్వరాచారి, పి.లక్ష్మణచారి, మహేశ్వరాచారి, సిద్ధి రాంబాబు పాల్గొన్నారు.



తొలగింపుపై యానిమేటర్ల నిరసన - ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి - దాచేపల్లి



డ్వాక్రా యానిమేటర్లుగా 20 ఏళ్ల నుండి పని చేస్తున్న వారిని ముందస్తు నోటీసులేమీ ఇవ్వకుండా తొలగించటాన్ని ఖండిస్తూ దాచేపల్లిలో సిఐటియు ఆధ్వర్యంలో యానిమేటర్లు గురువారం నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక మసీద్ సెంటర్ నుండి వెలుగు కార్యాలయం వరకు ర్యాలీ అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సిఐటియు పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే స్కీం వర్కర్లను రాజకీయ వేధింపులు గురి చేస్తోందని విమర్శించారు. తొలగించిన యానిమేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన యానిమేటర్లకు వేతనాలు బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. లేకుంటే దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక వెలుగు కార్యాలయంలోని ఇన్‌ఛార్జి ఎపిఎం రవికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా వద్ద కలిసి విన్నవించడంతోపాటు తమగోడును వెళ్లబోసుకున్నారు. దీనిపై పరిశీలిస్తామని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డ్వాక్రా యానిమేటర్లు సుమతి, లోకయ్య, మరియమ్మ, మేరీ, ధనమ్మ, శైలజ, హైమావతి, వరలక్ష్మి, రమాదేవి, తేజ, అచ్చయ్య పాల్గొన్నారు.

మెప్మా మార్కెట్‌లో తక్కువ ధరకే వస్తువులు


అర్బన్ మార్కెట్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ మార్కెట్లను ప్రవేశపెట్టిందని మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఈ మార్కెట్ల ద్వారా తక్కువ ధరలకు పలు రకాల వస్తువులను అందిస్తుందని చెప్పారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక అన్నా క్యాంటీన్ పక్కన ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్‌ను మున్సిపల్ ఛైర్మన్ గురువారం ప్రారంభించి మాట్లాడారు. అర్బన్ మార్కెట్ల ద్వారా డ్వాక్రా మహిళలకు ఉపాధి, వినియోగ దారులకు చౌకైన, మన్నికైన వస్తువులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నెలలో ఒకటిరెండు రోజులు నిర్వహించే ఈ మార్కెట్‌ను పట్టణ ప్రజలు సందర్శించి ఆదరించాలని కోరారు. మహిళలు తయారు చేసిన పలు రకాల పచ్చళ్లు, పిండి వంటలు, వస్తువులకు మంచి ఆధరణ లభించిందని, రూ.10వేలు పైగా అమ్మకాలు సాగాయని మెప్మా సిఈవో అంజలి తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సిఈవో రాజశేఖర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో అవినీతిపై విచారణ



ప్రజాశక్తి -దుర్గి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్. బి.రవి గురువారం పరిశీలించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో తనిఖీకి ఆయన వచ్చినా దాచేపల్లిలో డయేరియా నేపథ్యంలో అత్యవసరంగా అక్కడికి వెళ్లారు. రికార్డులను పరిశీలన కోసం జిల్లా కార్యాలయానికి తేవాలని ఆదేశించారు. ఆయనవెంట అధికారులు హరిప్రసాద్, డాక్టర్ పెద్ద సైదులు ఉన్నారు.

మద్యం తాగిన ఉద్యోగులు సస్పెండ్

ప్రజాశక్తి - మాచర్ల

విద్యుత్‌శాఖకు చెందిన నలుగురు ఉద్యోగులను విధుల నుండి తొలగించినట్లు విద్యుత్‌శాఖ ఇఇ రాంభట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ ఇన్స్‌పెక్టర్ ఒ.నాగరాజు, అసిస్టెంట్ లైన్‌మెన్ ఎస్.చెన్నకేశవులు, జూనియర్ లైన్‌మెన్ ఎం.పరబ్రహ్మాచారి, షిఫ్ట్ ఆపరేటర్ జి.శ్రీనివాసులు కారంపూడి మండలం గాదెవారిపల్లి సబ్‌స్టేషన్‌లో మద్యం తాగారని, ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో రావటంతో ప్రాథమిక విచారణాంతరం సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-ఈపూరు



ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో ఈపూరు మండలం ఎ.ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన గన్నేపల్లి చిన్నబాబు ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. బెంగళూరులోని క్రిస్ట్ యూనివర్సిటీలో జరిగే బాస్కెట్ బాల్ పోటీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు చిన్నబాబు ప్రాతినిధ్యం వహిస్తాడని ప్రిన్సిపాల్ తెలిపారు. చిన్నబాబును కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, ఎం.దాసు, సిహెచ్ అరవింద్, కె.వంశీ అభినందించారు.

భూ సమస్యలపై 77 అర్జీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని జలాల్పురంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 77 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ దానియేలు తెలిపారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎన్ఇసి విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ 4వ ఏడాది విద్యార్థి వై.ధనుష్ ఈ నెల 19, 20 తేదీల్లో భీమవరం ఎస్.ఆర్ కె.ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జె.ఎన్.టి.యు.కె అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ సెంట్రల్ జోన్ పోటీల్లో పురుషుల విభాగంలో మొదటి స్థానం సాధించాడు. చెన్నై ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ పోటీలకు జె.ఎన్.టి.యు.కె తరపున ఎంపికైనట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ గురు వారం తెలిపారు. చెన్నయ్‌లోనూ ఉత్తమ ప్రతిభ చూపాలని కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వర రావు ఆకాక్షించారు. దనుష్‌ను కళాశాల వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, పీడీ ఎల్.కృష్ణరెడ్డి, ఆంజనేయులు, విజయ్ అభినందించారు.

పోలీసులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పల్నాడు ఎస్‌పి కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసులు ఎన్నో ఒడిదుడుకులను, ఒత్తిళ్లను ఎదుర్కొంటారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గుండె వైద్య నిపుణులు, శ్రీ దత్త హాస్పిటల్ అధినేత డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, శ్రీ రాఘవేంద్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కనకగిరి అనిరుద్ ఫణిభార్గవ్, మ్యాక్స్ విజన్ కంటి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చెంచిరెడ్డి వైద్య పరీక్షలు చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జెవి. సంతోష్ (పరిపాలన), ఏఆర్ డీఎస్పీ జి.మహాత్మాగాంధీ, ఆర్ఐలు ఎల్.గోపినాథ్, యువరాజ్, కృష్ణ, ఎం.రాజా పాల్గొన్నారు.

నేర నియంత్రణపై సమీక్ష

నేరాల నియంత్రణపై పోలీసుల అధికారులతో పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సున్నితమైన భాషతో మాట్లాడాలని, సమస్యలను ఓపికగా విని న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని చెప్పారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే ప్రతిస్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి లేదా సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. గ్రీవెన్స్ ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలోగా పరిష్కరించి పోర్టల్‌లో డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలన్నారు. పోక్సో కేసులు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ప్రాపర్టీ కేసులు, మిస్సింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేగ నియంత్రకాలు, ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులను, అవసరమైన చోట స్టాప్ బోర్డులు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయాలని సూచించారు.



నాణ్యతా పరీక్షకు ఎరువుల నమూనాలు

ప్రజాశక్తి - నకరికల్లు

స్థానిక లక్ష్మీ ప్రసన్న ఏజెన్సీ, మహిత ట్రేడర్స్ ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు గురువారం తనిఖీలు చేశారు. స్టాక్ నిల్వలు, రిజిస్టర్లు, బిల్లు బుక్‌లను పరిశీలించారు. 5 పురుగు మందుల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామన్నారు. చీమలమర్రి, చల్లగుండ్ల, కండ్లగుంట, దేచవరం, చాగల్లు, రూపేనగుంట్ల రైతుసేవా కేంద్రాల్లో యూరియా, ఎంఓపి ఎరువుల నిల్వలు ఉన్నాయని, కావాల్సిన రైతులు సంప్రదించాలని సూచించారు.



వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పెదకొదమగుండ్ల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కారంపూడి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో అనంతపురం జిల్లా హిందూపూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ క్రీడల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కారంపూడి మండలం పెదకొదమగుండ్ల జెడ్‌పి పాఠశాల 9వ తరగతి విద్యార్థి శ్యాంప్రకాష్ ఉత్తమ ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం సాంబశివరావు తెలిపారు. శ్యాంప్రకాష్‌తోపాటు శిక్షణిచ్చిన పిఇటి కాలేశ్వరావును అభినందించారు.



వరద బాధితులకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విరాళం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడ వరద బాధితుల సహాయార్థం నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, యాజమాన్యం సేకరించిన రూ.5 లక్షల విరాళాలాన్ని గురువారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. కోమటినేని నాసరయ్య, నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ కళాశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు ప్రతి ఏడాది పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు కనుమూరి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

సహానా కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

తెనాలికి చెందిన సహానా మృతికి కారణమైన నవీన్‌ను కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద నగర తూర్పు కమిటీ అధ్యక్షులు టి.రాధా అధ్యక్షతన సహానాపై దాడి ఘటనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలపై దాడికి పాల్పడితే వారిని కఠినంగా శిక్షిస్తామని ప్రకటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెనాలి ఘటనపై ఇప్పటి వరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం తరపున పది లక్షల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదని, ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పదే పదే జరగడానికి కారణమైన మద్యాన్ని నియంత్రించకపోగా, వీదివీదికి బార్‌షాపులు పెట్టుకోవటానికి లైసెన్సులు ఇవ్వడం ఏమిటని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని అన్నారు. సహానా కుటుంబానికి న్యాయం చేయకపోతే సిఐటియు, అంగన్వాడీ, ఆశ తదితర సంఘాలు ఉద్యమిస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, నగర తూర్పు కమిటీ ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిఐటియు పొన్నూరు మండల కార్యదర్శి ఎన్.రమేష్‌బాబు, ఐద్వా నగర కార్యదర్శి ఏ.కళ్యాణి, సిఐటియు నగర (పశ్చిమ) ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, నాయకులు పూనేపల్లి శ్రీనివాసరావు, అంగన్వాడీ యూనియన్ నగర అధ్యక్షులు చిన వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద నిరసనలో పాల్గొన్న నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, జెవివి నాయకులు

27న జెవివి జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఈనెల 27న గుంటూరు, అమరావతి రోడ్డులోని హిందూ కాలేజి ఆఫ్ ఇంజి నీరింగ్‌లో నిర్వహిస్తున్నట్లు జెవివి గౌరవాధ్యక్షులు కెఎస్. లక్ష్మణరావు తెలిపారు. గురువారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లా స్థాయి సంబరాల్లో అన్ని మండలాల నుండి ఎంపికైన పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కల్పిం చటం, సృజనాత్మకత వెలికితీయటం కోసం గత 34 ఏళ్ళ నుండి జెవివి ఈ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తుందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో జెవివి నాయకులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి.వెంకటరావు, ఇ.అనిల్‌కుమార్, బి.శంకర్‌సింగ్, ఎస్.ఎం.సుభాని, టి.ఆర్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూ సమీ కరణ పథకంలో భూములిచ్చిన రైతులకు చెందిన రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకు నేందుకు సిఆర్‌డిఎ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రాజధాని గ్రామాల్లో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. ఇప్పటివరకు రిటర్నబుల్ ప్లాట్లు అందుకోని రైతులకు విజయవాడ లోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో చేపట్టిన ఈ - లాటరీ కార్యక్రమం రెండవ రోజు గురువారం జరిగింది. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సౌకర్యవంతంగా అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని అదనపు కమిషనర్ చెప్పారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల లోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువును పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ - లాటరీకి హాజరైన రైతులకు అదనపు కమిషనర్ నేతత్వంలో ఆన్లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు తొలుత ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఈ - లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించ డానికి ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియ మించామని చెప్పారు. చివరి రోజు జరిగిన ఈ - లాటరీ తొమ్మిది గ్రామాలకు సంబంధించి 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లను అందజేశారు. కార్యక్రమంలో సి ఆర్ డి ఎ ల్యాండ్స్ డైరెక్టర్ బి ఎల్ ఎన్ రాజ కుమారి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి డేవిడ్ రాజు, జి భీమారావు, కె స్వర్ణమేరి,జి సాయి శ్రీనివాస నాయక్, తహసీల్దార్ అరుణాదేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.



పత్రాలు అందజేస్తున్న సిఆర్ డిఎ అదనపు కమిషనర్

అమృత్ పథకంలో ఉచిత కుళాయి కనెక్షన్లు

ప్రజాశక్తి-గుంటూరు : అమృత్ పథకంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచితంగా కుళాయి కనెక్షన్ అంది స్తామని, అర్హులైన వారు స్థానిక వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమృత్ పథకంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, తెల్ల రేషన్ కార్డ్ కలిగి, ఏడాదికి రూ.500లోపు ఆస్తిపన్ను కలిగిన వారి నివా సాలకు ఉచిత కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలి పారు. అర్హులైన వారు తమ ప్రాంతంలోని వార్డ్ సచి వాలయంలో ఉచిత కుళాయికి నిర్దేశిత డాక్యుమెంట్‌ని జతచేసి అందించవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశమును వినియోగించుకోవాలని కోరారు.



ఆక్రమణలు తొలగిస్తున్న పొక్లెయినర్

ఉద్ధండరాయునిపాలెంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి మాజీ ఎంపి నందిగం సురేష్ ఇంటి సమీపంలో ఆక్రమణలను సిఆర్‌డిఎ అధికారులు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఉద్ధండరాయునిపాలెం గ్రామంలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన సుమారు రెండు ఎకరాల సిఆర్‌డిఎ భూముల్లో అక్రమ నిర్మాణాలలో కొన్నింటిని అధికారులు తొలగించారు. గురువారం సిఆర్‌డిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం విశ్వేశ్వర నాయుడు ఆధ్వర్యంలో ప్రొక్లైనర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్నారు. గ్రామంలో కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారని, పాకలు వేసుకున్నారని సిఆర్‌డిఎ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతానికి ఫెన్సింగ్, కొన్ని పాకలను తొలగించామని ఆయన చెప్పారు. కొంతమంది పూరి పాకలలోని సామాగ్రిని వెలుపలికి తెచ్చుకునేందుకు శుక్రవారం సాయంత్రం వరకు సమయం అడిగారని, అందుకు అంగీకరించామన్నారు. రాజధాని నిర్మాణ పనులు త్వరలో మొదలు కానునందున ల్యాండ్ పూలింగ్ భూముల్లో పంటలు సాగు చేయవద్దని, ఆ మేరకు మైకుల్లో ప్రచారం చేయడం జరిగిందన్నారు.

28న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాపితంగా అక్టోబర్ 28న మున్సిపల్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జిల్లా విస్తృత సమావేశంలో కె.ఉమామహేశ్వ రరావు మాట్లాడుతూ 17 రోజుల సమ్మె కాలం జీతం, పండుగ కానుక రూ.వెయ్యి, సమ్మె ముగిసి 10 నెలలు అవుతున్నా ఇంతవరకు చెల్లించలేదన్నారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద మరణం ఎక్స్‌గ్రేషియో రూ.5లక్షల నుండి రూ.7లక్షలకు పెంపు, దహన సంస్కార ఖర్చులు రూ.20వేలకు పెంపు, ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపు జి.ఓలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా జారీ చేయకపోవటం అన్యాయమన్నారు. విజయవాడలో వరద ముంపు నివారణ పనులకు రాష్ట్రం లోని వివిధ మున్సిపాల్టీల నుండి వచ్చి పనిచేసిన కార్మికు లకు రెండు జతల బట్టలు అన్ని మున్సిపాల్టీలలో ఇవ్వలేద న్నారు. స్థానికంగా వాహనాల రిపేర్లు, పనిముట్లు, పుష్ కార్టులు సరిగా లేకపోవటంతో కార్మికులు తీవ్రమైన ఇబ్బం దులు పడుతున్నారన్నారు. చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ కార్మికులకు ఇవ్వటం అధికారులు మర్చిపోయా రన్నారు. ఆయా సమస్యలపై మున్సిపల్ మంత్రికి, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందిం చట్లేదని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు నిచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకూడా తప్పదని హెచ్చరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ సమ్మె ముగిసి 10 నెలలు అవుతున్నా జిల్లాలో జిఎంసి, పొన్నూరు మున్సి పాలిటీలలో సమ్మె కాలం జీతం, రూ.1000లు పండుగ కానుక చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శిం చారు. జిఎంసి పరిధిలో స్పెషల్ శానిటేసన్ డ్రైవ్ పేరుతో కార్మికులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్న అధికారులు వారికి ఇవ్వాల్సిన పనిముట్లు సక్రమంగా ఇవ్వట్లేదని, చెత్త తరలించే వాహనాలు రిపేర్లు చేయించక పోవటంతో కండీషన్‌లో లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. చెత్త తరలించే వాహనాల డ్రైవర్లకు 8 గంటల పని విధానం అమలు చేయకపోవటంతో ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోతు న్నారని తెలిపారు. జిఎంసిలోని సెక్యూరిటీగార్డులకు, తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్స్ కార్మికులకు యూనిఫారం, రెయిన్ కోట్‌లు, టార్చ్ లైట్‌లు, విజిల్స్, టూల్ కిట్‌లు ఇవ్వాలని పలుమార్లు కోరుతున్నా ఇవ్వట్లేదని, కార్మికులు ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. సమావేశంలో యూని యన్ జిఎంసి కమిటి అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కె.వెంగమ్మ, నిమ్మకాయల మంగమ్మ, భూషమ్మ, పాశం పూర్ణచంద్రరావు, కె.మరియదాసు, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు



రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, కొండబాబు లను సన్మానిస్తున్న రత్నాకర్ తదితరులు

ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

గుంటూరు జిల్లా అధ్యక్షునిగా రత్నాకర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షునిగా కనపర్తి రత్నాకర్ ఎంపికయ్యారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు ఎస్‌హెచ్‌ఒ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో గుంటూరు జిల్లా ఫెడరేషన్ నూతన కమిటి ఎంపిక జరిగింది. సమావేశానికి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లాలోని ఏడు నియోజక వర్గాల కమిటిలతో పాటు జిల్లా కమిటిని ప్రకటించారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్య దర్శిగా పట్నాల సాయికుమార్, ఉపాధ్యక్షులుగా వేముల రాజేష్, గౌరవాధ్యక్షులుగా అజయ్ ఇండియన్, ఎం.శ్రీకాంత్, కార్యనిర్వహణ కార్యదర్శిగా వరదల మహేష్, కోశాధికారిగా కొండవీటి పుల్లారావు, కార్యదర్శులుగా పుట్ట పున్నయ్య, అచ్యుత సాంబశివరావు, అంబటి శ్యామ్ సాగర్, చింత మణికుమార్, కార్యవర్గ సభ్యులుగా బుర్ర సుధీర్ కుమార్, ఎన్ జె సామ్యూల్, డి కోటేశ్వరరావు, యు కోటేశ్వరరావులను ఎంపిక చేసారు. సమావేశంలో పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కొండ బాబు మాట్లాడుతూ ఫెడరేషన్ నూతన నాయకత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో గుంటూరు తూర్పు, పశ్చిమ, పొన్నూరు, తెనాలి, తాడికొండ, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజక వర్గాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మెను ఉధృతం చేస్తాం

నిరవధిక సమ్మె శిబిరాన్ని ప్రారంభించిన నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎంటిఎంసి పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సిపిఎం పట్టణం కార్యదర్శి వర్గ సభ్యులు వివి జవహర్లాల్ హెచ్చరించారు. క్లాప్ ఆటో డ్రైవర్ల రెండు నెలల వేతనాలు చెల్లించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ క్లాస్ ఆటో డ్రైవర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఎంటిఎంసి మంగళగిరి కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్లు నిరవధిక సమ్మె శిబిరాన్ని ప్రారంభించి గురువారం మాట్లాడారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు చెల్లించేలాగా చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ కలగ చేసుకోవాలని అన్నారు. రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. రూ.12,500 వేతనానికి మాత్రమే చేస్తున్న ప్పటికీ సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ మాట్లాడుతూ క్రాప్ ఆటో డ్రైవర్ల సమ స్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లిస్తేనే సమ్మె విరమిస్తారని అన్నారు. కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు రవి, మనీ, నాని, సతీష్, శివ, యోహాన్, ఆర్ కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట క్లాప్ ఆటో డ్రైవర్ల నిరవధిక సమ్మె

నూజెండ్లకు 6 ఎత్తిపోతల పథకాలు మంజూరు

- గుండ్లకమ్మపై హైలెవెల్ వంతెనకు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన
- గత టిడిపి ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులింకా రాలేదని మంత్రికి తెలిపిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నూజెండ్ల

వినుకొండ మండలం గోకనకొండ-నూజెండ్ల మండలం పువ్వాడ మధ్య గుండ్లకమ్మ నదిపై హైలెవెల్ వంతెనకు రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.20.15 కోట్లతో చేపట్టనున్న ఈ వంతెన నిర్మాణంతో నూజెండ్ల, వినుకొండ మండలాలతోపాటు బాపట్ల, గుంటూరుకు సులువుగా రాకపోకలకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ ఎస్సీ కాలనీలో ఇంటింటికీ ట్యాప్ కనెక్షన్ పథకాన్ని ప్రారంభించారు. ములకలూరులో సీసీ రహదారులు, మినీ గోకులం నిర్మాణ శిలాఫలకాలు ఆవిష్కరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మపై వంతెన అవసరాన్ని ఎంపీ లావు కేంద్రం దష్టికి తీసుకెళ్లి దగ్గరుండి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటించి 6,350 టీచర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనుందని, ఐదేళ్లలో 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం గోదావరి జలాలు సాగర్ కుడి కాల్వలో కలపడమేనని అన్నారు. నదుల అనుసంధానంపై ప్రధానితో సిఎం చర్చించారని, నిధుల మంజూరుకు కేంద్రం సానుకూలంగా ఉందని చెప్పారు. వరికపూడిశెల ప్రాజెక్టును త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇంటింటికీ ట్యాప్ కనెక్షన్ పథకాన్ని కూటమి ప్రభుత్వ పరంగానే ముందుకు తీసుకెళ్నామని, టెండర్లు కూడా పిలిచామని చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో 30 శాతం గ్రామాల్లో టెండర్లు పిలిచారన్నారు. బిల్లులకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయిస్తామన్నారు. ప్రస్తుతం చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెప్పారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులింకా రాలేదని, ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి ఇప్పించాలని ఇన్‌ఛార్జి మంత్రిని కోరారు. నూజెండ్ల మండలానికి 6 ఎత్తపోతల పథకాల కోసం రూ.113 కోట్లు మంజూరయ్యాయని, పువ్వాడలో రూ.40 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వినుకొండ పట్టణంలోని అజాద్ నగర్ కాలనీవాసులకు విద్యుత్ సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలి సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. వినుకొండకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్‌కు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నివాసంలో వినతిపత్రం ఇచ్చారు.





దరఖాస్తును ఎన్నికల పరిశీలకునికి అందచేస్తున్న ఎమ్మెల్యే

ఓటు హక్కు కోసం ఎమ్మెల్యే దరఖాస్తు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సామాజిక బాధ్యతో పట్టభద్రులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లిలోని తన కార్యాలయంలో ఓటు హక్కు కోసం గురువారం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అర్హులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి - వినుకొండ : గొంట్ల వెంకమ్మ, రంగయ్య జ్ఞాపకార్థం వారి మెమోరియల్ ట్రస్ట్ తరపున స్థానిక 15వ వార్డు ప్రాథమి కోన్నత పాఠశాలలో విద్యార్థులందరికి నోట్ పుస్తకాలు, పెన్నులను వారి కుమారుడు, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు జి.కమలారామ్ గురువారం అందజేశారు. 18 ఏళ్లుగా పంపిణీ చేస్తున్నామని, ఏడాదికో పాఠశాలలో అందిస్తున్నామని చెప్పారు. హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యా యులు నాగరాజు, కోటేశ్వరరావు, రమాదేవి పాల్గొన్నారు.

ఎంఎఎం ఫార్మసీ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట మండలంలోని కేసనపల్లి గ్రామ పరిధిలో గల ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో అధ్యాపకుడు తూనుగుంట్ల భవాని రమేష్ కుమార్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగంలో సత్య సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్, మధ్యప్రదేశ్ నుండి డాక్టరేట్ పొందారని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డయాబెటిస్ మిల్లీటస్ వ్యాధి తీవ్రత, దాని దుష్ఫలితాలు చికిత్స విధానాలపై పరిశోధనకు రమేష్ కుమార్‌కు డాక్టరేట్ వచ్చినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు పేర్కొన్నారు. రమేష్‌బాబుకు కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఎంపీతో ఎమ్మెల్యే భేటీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో ఎంపీని గురువారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కలిశారు. నరసరావుపేట నియోజకవర్గంలో తక్షణమే చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ వ్యవహారాలపై చర్చించారు.

భూసారం ఆధారంగా ఎరువుల వినియోగం : డిడిఎ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



భూసార స్థితిగతుల ఆధారంగా ఎరువుల వినియోగం ఉండాలని రైతులకు జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డిడిఎ ఎం.శివకుమారి సూచించారు. నరసరావుపేట మండలం పెద్దరెడ్డిపాలెంలో నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు గురువారం శిక్షణిచ్చారు. డిడిఎ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల అధికంగా వాడకం వల్ల భూసారం దెబ్బ తింటుదని, అధిక నత్రజని వాడకం వల్ల పురుగులు ఎక్కువగా ఆశించడం, తెగుళ్లు ఉధృతంగా వస్తాయని చెప్పారు. వరిలో ఎరువుల వాడకంలో సమతుల్యత పాటించాలన్నారు. పొటాష్ వాడే సందర్భంలో దానిని రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని దమ్ములోను, రెండవ భాగాన్ని చిరుపొట్ట దశలోను వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బయో ఫెర్టిలైజర్స్ యొక్క ఉపయోగాలు, వినియోగం గురించి శిక్షణిచ్చారు. డాట్ సెంటర్ సైంటిస్ట్ మాట్లాడుతూ దాళ్వ పంట కింద మొక్కజొన్న, వరి, శనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మాక్‌పోలింగ్ ద్వారా విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఈపూరు

విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి పాఠశాలలో మాక్ పోల్ ద్వారా అవగాహన కల్పించామని మండలం కేంద్రమైన ఈపూరు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం ఎన్.రామకృష్ణారెడ్డి అన్నారు. పాఠశాలలో దేశ్ అప్నాయోన్ సహయోగ్ ఫౌండేషన్ (డిఎఎస్ఎఫ్) ద్వారా యాక్టిజన్ క్లబ్ నిర్వహణ కోసం 6వ తరగతి విద్యార్థులతో మాక్ పోల్ గురువారం నిర్వహించారు. విద్యార్థులను అభ్యర్థులగా ఎంపిక చేసి పోలింగ్ విధానం, అనంతరం విజేతల ప్రకటన, ప్రమాణ స్వీకారం చేయించారు. పిఇటిలు ఎ.వీరాంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయినులు హనుమాయమ్మ, అరుణకుమారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.



మాక్ పోల్ లో విధులు నిర్వహిస్తున్న విద్యార్థులు



వాగ్దేవి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : చెన్నైకి చెందిన బహుళజాతి కంపెనీ టెక్ మహేంద్ర కంపెనీ తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 21 మంది ఉద్యోగాలు సాధించారని వాగ్దేవి కళాశాలల సెక్రటరీ - కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు గురువారం తెలిపారు. నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని కళాశాలలో కంపెనీ హెచ్.ఆర్ ప్రతినిధులు ఎన్.చిన్న రాజప్ప వివిధ విభాగాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులు 21 మంది ఎంపికయ్యారన్నారు. వీరికి శిక్షణ కాలంలో వార్షిక వేతనం రూ.3.20 లక్షల వరకు కంపెనీ చెల్లిస్తుందన్నారు. డిగ్రీ పూర్తయిన అనంతరం ఉద్యోగాలలో చేరతారన్నారు. ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కె.రామకోటేశ్వర రావు, ఒ.నాగేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, ఎస్.సురేష్ బాబు, పి.కృష్ణారావు, ఐ.క్రిష్ణకిషోర్ అభినందించారు.

ఎస్ఐకు నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి- వెల్దుర్తి : వెల్దుర్తి ఎస్ఐగా బాధ్యతులు చేపట్టిన సమందర్‌వలిని పలువురు నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో టిడిపి నాయకులు కంపసాటి కొండలు, పెవేటి నాగరాజు, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సామేలు, మండల బిజెపి అధ్యక్షులు గండ్ర మలికార్జున్ ఉన్నారు.

సరైన వేతనాలు, సెలవుల కోసం కార్మికుల ధర్నా



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ వేతనాలు, వారాంతపు పండగ సెలవులు ఇవ్వకపోవడం అన్యాయమని, వాటిని వెంటనే అమలు చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పై సమస్యలతోపాటు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట, ఇంజనీరింగ్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు షేక్ చిన్న అలబక్షు, కార్యదర్శి సోమశేఖర్, కె.శ్రీను, బాలాజీ సింగ్, బి.శ్రీను, షకీలా, శ్రీను రంగనాయకులు, జి.సామ్రాజ్యం పి.నాగయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన-అధికారుల తీరుపై ఆగ్రహం

ఉద్యోగం కావాలంటే స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు ఉండాలని అధికారులు మాట్లాడడం సిగ్గుచేటని, తొలగించిన కార్మికులు, ఉద్యోగులను జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. రాజకీయ వేధింపులలో నేపథ్యంలో మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, ఉద్యోగులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ చేపట్టిన నిరసన దీక్షలు గురువారం 22వ రోజుకు చేరుకున్నాయి. దీక్షాపరులకు పూలమాలలేసి దీక్షలను ప్రారంభించిన సిలార్ మసూద్ మాట్లాడుతూ అత్తెసరుగా ఉన్న వేతనాలు పెంచి కనీస వేతనాలు అమలు చేస్తారన్న ఆశలు అడియాసలు చేస్తూ ఉద్యోగాల నుంచి తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో కార్మికులు ఉన్నారన్నారు. సిఎం, డిప్యూటీ సిఎం ప్రకటనలకు విరుద్ధంగా క్షేత్రస్థాయి పరిస్థితులు ఉన్నాయన్నారు. పిడిఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ చట్టాలను అమలు చేయాల్సిన ఉన్నతాధికారులు ఫలానా వారు ఫలానా పార్టీ అనేంత స్థాయిలో మాట్లాడుకోవడం దిగజారుతున్న పాలనా పద్ధతులకు నిదర్శనమన్నారు. ఉన్నతాధికారులు సైతం మంచి పోస్టింగ్, ట్రాన్స్‌ఫర్ల కోసం అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారని, అధికార పార్టీ నేతల మెప్పు కోసం చట్ట విరుద్ధమైన పనులు చేయడం, న్యాయం కోసం వచ్చిన బాధితులనే బెదరించడం దారుణమని మండిపడ్డారు. పిడిఎం నాయకులు ఎన్.రామారావు, వై.వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు కోటా నాయక్ తదితరులు సంఘీభావం తెలిపారు. చిన్న అల్లాబక్షు, షేక్ మహబూబ్ సుభాని, షేక్ మహబూబ్ బాషా, షేక్ సైదా, పోలూరి రమణ, అక్కి పద్మ పాల్గొన్నారు.



రోడ్డు పక్కన కాలం తీరిన తినుబండారాలు





ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని విజయవాడ క్లబ్ దాటిన తర్వాత సుందరయ్య నగర్ కట్ట పక్కన జనా వాసాల మధ్య కాలం తీరిన పిల్లల తినుబండారాల ప్యాకెట్లను గుట్టలు గుట్టలుగా గుర్తుతెలియని వ్యక్తులు పడేసి వెళ్లారు. చెత్త సేకరించేవారు వీటిని మరల తక్కువ ధరలకు షాపులకు తీసుకెళ్లి అమ్మితే, అవి తిన్న తర్వాత చిన్న పిల్లలు వివిధ అనారోగ్యాలకు కారణమయ్యే అవకాశం ఉంది. సహజంగా కాలం తీరిన ఆహార పదార్థాలను గుంట తీసి పూడ్చిపెట్టాలి. లేదా మంట వేసి తగలబెట్టాలి. అలాగాకుండా రోడ్డు పక్కన పడేసి వెళ్ళటం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలా పడవేసిన పదార్థాల సమీపంలోనే సుమారు 1000 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యన భ్యసించి పాఠశాల కూడా ఉంది. రోడ్డు మీదకు వచ్చి పొర పాటున తెలియక పిల్లలు కాలం తీరిన ఈ పదార్థాలను తీసు కొని తింటే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చిన్నపిల్లలు ఇష్టంగా తినే షిప్స్, స్నాక్స్ తదితర తినుబండా రాలు వెంటనే సంబంధిత అధికారులు అక్కడ నుంచి తరలించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

27న దుగ్గిరాలలో పట్టభద్రుల ఓటు నమోదు

ప్రజాశక్తి - దుగ్గిరాల

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రం దుగ్గిరాలలో చేపట్టనున్నట్లు టిడిపి నాయకులు గద్దె శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జమ్మి చెట్టు, శివాలయం సెంటర్ ఏ ఎల్ ఈ సి చర్చి పుర వేదిక అలీ నగర్ మరియు సెంట్రల్ వేర్ హౌస్ వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హత గలవారు డిగ్రీ జిరాక్స్ లేదా దాని సమానమైన విద్యార్హత ఆధార్ కార్డ్ ఓటర్ ఐడి కార్డ్ జిరాక్స్ కాపీలు మొబైల్ నెంబర్ ఒక ఫోటో తో వచ్చి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

వెహికిల్ షెడ్‌లో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి శానిటరీ ఇన్స్పెక్టర్, ట్రాక్టర్, డ్రైవర్లకు మ్యాపింగ్ చేసి చెత్త తరలింపు వాహనాలు కేటాయించాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ స్థానిక కెవిపి కాలనీలోని నగరపాలక సంస్థ వెహికిల్ షెడ్‌ని ఆకస్మికంగా తనిఖీచేసి, డ్రైవర్లు, పర్యవేక్షణ అధికారులు సకాలంలో హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, వాహనాల నిర్వహణ, పారిశుధ్య విభాగానికి వాహనాలు కేటాయించడంపై తగు ఆదేశాలు జారీచేశారు. ఈసందర్భంగా కమిషనర్ తొలుత వెహికిల్ షెడ్‌లో నిర్దేశిత సమయానికి పూర్తి స్థాయిలో డ్రైవర్లు, పర్యవేక్షణ చేసే ఏఈ విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఎన్ని పర్యాయాలు చెప్పినా పనితీరులో మార్పు కనబడడం లేదని, ఇక నుండి ఉదయం 5గంటలకు హాజరుకాకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెహికిల్ షెడ్‌లో డ్రైవర్ల హాజరుకి రిజిస్టర్ నిర్వహించాలన్నారు. వాహనాల మరమత్తులు యుద్ధప్రాతిపదికన చేయించాలన్నారు. ఈ-ఆటోల నిర్వహణకు సదరు కాంట్రాక్ట్ ఏజన్సీ రెండ్రోజుల్లో తగిన ఏర్పాట్లు చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. అనంతరం అదనపు కమిషనర్, సిఎంఓహెచ్, ఎంహెచ్ఓ, ఇతర ప్రజారోగ్య అధికారులతో సమావేశమై నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు జరగాలని, అందుకు తగిన విధంగా వాహనాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పర్యటనలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓలు డాక్టర్ రవిబాబు, రాంబాబు, రామారావు, ఆనందకుమార్, డిఈఈ సతీష్, ఏఈ రవి కిరణ్ పాల్గొన్నారు.



కృష్ణమ్మను చూడటానికి వెళ్లేవారూ.. జర భద్రం

ప్రజాశక్తి-తాడేపల్లి

కృష్ణానది సోయగాలను చూడటానికి వెళ్లేవారు జర భద్రం అంటున్నారు సీతానగరం వాసులు. ప్రకాశం బ్యారేజీ దిగువ నుండి సీతానగరం వైపు పుష్కర ఘాట్ల వరకు వెళ్లే రోడ్డు పక్కన కృష్ణానదికి ఏర్పాటు చేసిన రిటైనింగ్ వాల్ శిథిలావస్థకు చేరి పాడైపోయింది. గత పుష్కరాల సందర్భంగా తాత్కాలిక మరమ్మతులు చేశారు. కాంక్రీట్ వేసిన చోట కింద నిర్మాణమైన రిటైనింగ్ వాల్ గోడ ఇప్పటికే కూలి కృష్ణా నదిలో పడి వరదలకు కొట్టుకుపోయింది. ఫలితంగా పెద్ద కంత ఏర్పడింది. పెద్దలు వెంట వచ్చిన పిల్లలు ఆద మరచి అటువైపు వెళ్లారో ఇక అంతే సంగతులు. సుమారు 600 మీటర్లు పొడవున ఏర్పాటు చేసిన కృష్ణా నది రిటైనింగ్‌వాల్ అడుగడుగునా పగుళ్లు ఇచ్చి పడిపోవడానికి సిద్దంగా ఉంది. ఇటీవల కృష్ణా నదికి వరదలు వచ్చిన సందర్భంగా పెద్ద ఎత్తున తిలకించటానికి పిల్లాపాపలతో కుటుంబాలు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని పాడైపోయిన కృష్ణా నది రిటైనింగ్ వాల్‌ను వెంటనే బాగు చేయాలని కోరుతున్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, దిలీప్ రాజా

జగ్జీవన్‌రామ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పెదరావూరు ఫిల్మ్ స్టూడియోస్ బ్యానర్ పై నిర్మాణంలో ఉన్న జగజ్జీవన్ రామ్ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ ను ఆంధ్ర ప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఉద్దండరాయనిపాలెం రాష్ట్ర సచివాలయంలో గురువారం పోస్టర్ విడుదల చేసినట్లు సినీ దర్శకులు దిలీప్ రాజా తెలిపారు. తెనాలి మా-ఎపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వంద సంవత్సరాల క్రితం జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా చిత్రీకరిస్తున్న సినిమా నిర్మాణం మరో ఆరు మాసాలు సమయం పడుతుందని అన్నారు. అప్పట్లో విద్యుత్, రహదార్లు, లేకపోవటంతో అధిక శాతం సన్నివేశాలను సెట్టింగులు వేసి చిత్రీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ చందోలు నాగమల్లేశ్వర రావు నిర్మిస్తున్న ఈ బయోపిక్ తదుపరి షెడ్యూల్ నవంబరు 9 నుండి తెనాలిలో జరుగుతుందన్నారు. జగజ్జీవన్ రామ్ పాత్రని మిలటరీ ప్రసాద్ పోషిస్తున్నారన్నారు. చందోలు దేవదాసు సమర్పణలో రూపొందుతున్న సినిమాను 2025లో విడుదల చేస్తామని చిత్ర కో- ఆర్డినేటర్ కాలేబ్ రాజు తెలిపారు.

పోలియో డే సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - పెదనందిపాడు

వరల్డ్ పోలియో డే సందర్భంగా ఈరోజు గురువారం పెదనందిపాడు లో అశోక హై స్కూల్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు పోలియో అవగాహన ర్యాలీ జరిగింది. స్కూల్ డైరెక్టర్ పి లక్ష్మీనారాయణ, రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎన్ శివప్రసాద్ , రోటరీ సభ్యులు బి శ్యామ్సన్, జె సాంబశివరావు, పెదనందిపాడు ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి సిహెచ్ఓ ప్రసాద్ స్వామిపాల్గొన్నారు.



పెదనందిపాడులో అవగాహన ర్యాలీ



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బి శేషన్న గురువారం పరిశీలించారు. వార్డు పర్యటనలో భాగంగా పట్టణంలోని ఏడవ వార్డులో ఆయన పర్యటించారు. కార్మికులు చేస్తున్న ఇంటింటి చెత్త సేకరణ, రోడ్ల వెంట చెత్తను తొలగించడం, సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించంటం వంటి పనులను పరిశీలించి, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో అలసత్వం సహించేది లేదన్నారు. ప్రజలు కూడా పారిశుధ్యం మెరుగుకు సహకరించాలన్నారు. వ్యర్థాలను కాలువల్లో వేయకుండా, చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. ఆయన వెంట శానిటరి ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటరీ సెక్రటరీ ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏపీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగరాజు

రాజకీయ, ఆర్థిక రంగాల్లోనూ వర్గీకరణ అమలు చేయాలి

ప్రజాశక్తి-మంగళగిరి : భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఏడుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత పై ఆయా రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనిస్తూ చారిత్రక, సంచలన తీర్పును వెలువరించిన విషయం విదితమే అని చిలుకూరి నాగరాజు అన్నారు. గురువారం మంగళగిరి పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో నాగరాజు మాదిగ మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేవలం విద్యా, ఉద్యోగ రంగాలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎస్సిల్లోని బాగా వెనుకబడిన వర్గాలు అభివృద్ధి చెందాలంటే సదరు తీర్పును ఆర్థిక, రాజకీయ రంగాలలో కూడా అమలు చేయవలసిన ఆవశ్యకత ఉందని సుప్రీమ్ కోర్టుకు తెలియచేస్తూ, ఎమ్మార్పిఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగ రాజు మాదిగ సుప్రీమ్ కోర్టు ఫిర్యాదుల విభాగానికి ఈమెయిల్ ఐడి ద్వారా ఫిర్యాదు చేసామని ఆయన తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వంశీకృష్ణ రాజా

క్లౌడ్ టెక్నాలజీపై యూనివర్సల్‌లో అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం క్లౌడ్ కంప్యూటింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఫాదర్ పి బాలస్వామి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రతి ఒక్కరు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని అన్నారు. కంప్యూటర్ రంగంలో నూతన ఆవిష్కరణలు ఆవిర్భవిస్తున్నాయని అన్నారు. డాక్టర్ పి వంశీకృష్ణ రాజా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానంలో ప్రావీణ్యత కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలో సమయం చాలా విలువైనదని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి పోటీ తత్వాన్ని అలవర్చుకొని మంచి ఫలితాలు రాబట్టడంతో నిర్దేశించుకున్న లక్ష్యం దరి చేరుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.కోటి రెడ్డీ, పలు విభాగాల హెచ్ ఓ డి లు పాల్గొన్నారు.

మంగళగిరి చేరిన కృతజ్ఞతా యాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత ఎన్నడూ లేని విధంగా కల్పించడమే కాకుండా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడించిన వెంటనే ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని మాదిగలకు భరోసా ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మాదిగ జాతి తరపున, ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త, మాదిగ సంఘాల జేఏసీ చైర్మన్, పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.గురువారం అంబేద్కర్ సెంటర్లో జరిగిన విలేకరుల సమావే పేరుపోగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిందూపురం నుంచి మాదిగల కృతజ్ఞతాయాత్ర మంగళగిరి చేరుకుందని అన్నారు. చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆగస్టు 16న హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞతాయాత్ర చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, టిడిపి గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు, టిడిపి నాయకులు కట్టేపోగు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న కెఎల్‌యు విద్యార్థి వరుణ్

కెఎల్‌యు విద్యార్థికి మిస్టర్ ఇండియా అవార్డు


ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న కొత్తపల్లి వరుణ్ చౌదరి మిస్టర్ ఇండియా పురస్కారానికి ఎంపికయినట్లు వర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో అస్సాంలోని గౌహతిలో జరిగిన మిస్టర్ నార్త్, ఈస్ట్ ఇండియా పోటీలలో పాల్గొన్న వరుణ్ చౌదరి అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ రన్నరప్ బహుమతిని ప్రకటించారని తెలిపారు. గతంలో రాయల్ మిస్టర్ ఇండియా టైటిల్ ను కూడా సొంతం చేసుకున్న వరుణ్ చౌదరి రానున్న కాలంలో మరిన్న అవార్డులు సాదిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరుణ్ చౌదరిని వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి - తాడికొండ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణ్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లాం గ్రామం నందు అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమమును పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పొన్నికల్లు ఆరోగ్య కేంద్రం నందు ట్యూబెక్టమీ ఆపరేషన్ వ్యాక్సిన్ నిలవ అమలు తీరును పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర వైద్యా ధికారిణి వి వి శైలజ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు,పల్నాడు డిఇఒలుగా రేణుక, చంద్రకళ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, పల్నాడు జిల్లాలకు నూతన విద్యాశాఖ అధికారులుగా సి.వి.రేణుక, ఎల్ చంద్రకళ నియమితులయ్యారు. రేణుక ప్రస్తుతం పాఠశాల విద్య కమిషనరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిఇఒల బదిలీల్లో భాగంగా వీరు నియమితులయ్యారు. కాగా ప్రస్తుతం డిఇఒగా పనిచేస్తున్న పి.శైలజకు పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పల్నాడు జిల్లా డిఇఒగా విశాఖలో ఉన్న చంద్రకళను నియమించారు.



గుంటూరు డిఇఒ రేణుక

అథ్లెటిక్స్‌లో టిజెపిఎస్ విద్యార్థికి బంగారు పతకాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువున్న షేక్.రోషన్ ఇటీవల ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగిన సౌత్‌జోన్, నేషనల్ అథ్లెటిక్స్‌లో 100 మీటర్స్ పరుగుపందెంలో, 110 మీటర్స్ హర్డిల్స్‌లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాలు సాధించాడని కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ యస్.అనితాదేవి తెలిపారు. కళాశాల సెక్రెటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం మాట్లాడుతూ ఒక వైపు చదువుని నిర్లక్ష్యం చేయకుండా ఇష్టమైన క్రీడా రంగంలో రానించడం చాలా గొప్ప విషయమని, జీవిత లక్ష్య చేధనలో తప్పకుండా విజయం సాధిస్తాడని ఆకాంక్షించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజి, కోచ్‌లు కె.కష్ణమోహన్, కె.రవికోచ్, వైస్‌ప్రిన్సిపాల్ భానుమురళి, డాక్టర్ జె.వి. సుధీర్‌కుమార్ తదితరులు విద్యార్థిని అభినందించారు.



రోషన్‌ను అభినందిస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపల్ తదితరులు

విజ్ఞాన్స్ ఇండస్ట్రియల్ డైరెక్టర్‌కు డ్రోన్ హ్యాకథాన్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఇండస్ట్రియల్ డైరక్టర్‌గా సేవలందిస్తున్న ప్రసాద్ పాండాకు డ్రోన్ హ్యాకథాన్‌లో అవార్డు లభించిందని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొ-ఒషన్ మంగళగిరి, సీకే కన్వెన్షన్స్‌లో నిర్వహించిన 'అమరావతి డ్రోన్‌సమ్మిట్-2024' లో తమ వర్సిటీకు చెందిన ఇండస్ట్రియల్ డైరక్టర్ ప్రసాద్ పాండా డ్రోన్ హ్యాకథాన్‌లో మూడవ బహుమతి అందుకున్నారని వెల్లడించారు. ఈ అవార్డును సిఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్‌మోహన్ నాయుడు చేతుల మీదగా అవార్డుతోపాటు, రూ.50వేల నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ కోసం డ్రోన్‌లను ఎలా ఉపయోగించుకోవచ్చు, ప్రాజెక్ట్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, పట్టణ అభివద్ధికి డ్రోన్‌లను ఉపయోగించడానికి అత్యంత ప్రభావవంతమైన విధానాన్ని ప్రతిపాదించినందుకుగాను ఈఅవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ పాండాను విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అభినందించారు.



అవార్డు అందజేస్తున్న చంద్రబాబు తదితరులు

చలపతిలో ఘనంగా టెక్ నిర్వాణ్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో సిఎస్ఇ, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి టెక్ నిర్వాణ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌లో భాగంగా కోడ్‌క్రాఫ్ట్ ఛాలెంజ్, ఇన్నోవేషన్ షోకేజ్, మైండ్‌బైట్స్, టెక్నోస్ట్రోమ్ తదితర పోటీలు నిర్వహించగా, రాష్ట్రంలోని వివిధ కాలేజిల నుండి 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయటానికి ఇలాంటి ఫెస్ట్‌లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

టెక్ నిర్వాణ్‌లో మలినేని విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు : మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థినులు చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహిస్తున్న 'టెక్ నిర్వాణ్-2024'లో బహుమతులు సాధించారని కళాశాల ప్రన్సిపాల్ తెలియజేశారు. వి.నవ్య, పి.అంకిత, టి.లలిత పేపర్ ప్రజంటేషన్‌లో ప్రథమ బహుమతి, వి.బిందు, యు.మంజీర, జెడ్ ఫాతిమా పోస్టర్ ప్రజంటేషన్‌లో ప్రథమ బహుమతి, వై.కీర్తి, ఎస్.కె.అస్మాషరీన్, వి.ఉమామహేశ్వరి టెక్ క్విజ్‌లో ద్వితీయ బహుమతి సాధించా రన్నారు. ఆయా విద్యార్థులను మలినేని ఛైర్మన్ డాక్టర్ పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ జె.అప్పారావు, వివిధ విభాగాల హెచ్ఒడిలు రామస్వామి, ఛార్లెస్ జయరావు అభినందించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఛైర్మన్ తదితరులు

రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రభుత్వ నూతన మార్గదర్శకాలపై సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రబీ 2024-25లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంటల బీమాలో నూరు శాతం ఇష్టపూర్వకంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ రబీ 2024-25 పంటల బీమాలో రైతుల నమోదుపై జిల్లా కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించి, పంటల బీమాకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను వివరించారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్‌తేజ, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వరకు ఈ-పంటలో నమోదైన రైతులందరికీ ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి పంటల బీమాలో నమోదు చేయటం జరిగిందని, ఇటీవల ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రబీ 2024-25లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ఇష్టపూర్వంగా నిర్దేశించిన ప్రీమియం షేర్‌ను చెల్లించి పంటల బీమాలో నమోదు కావాల్సి ఉందన్నారు. జిల్లాలో రబీలో జొన్న, మొక్క జొన్న, పెసర, మినుము, శెనగల పంటలను దిగుబడి అధారంగా మండల యూనిట్‌గా ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ పంటల బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. జొన్నకు ఎకరాకు రూ.19వేలకు బీమా చేసేందుకు రైతువాటాగా (0.25శాతం) రూ.48 ప్రీమియం, మొక్కజొన్నకు ఎకరాకు రూ.38,000కు రైతు వాటాగా (0.3శాతం) రూ.114 ప్రీమియం, పెసరకు ఎకరాకు రూ.18,000కు బీమా చేసేందుకు రైతువాటా (0.25 శాతం) రూ.45 ప్రీమియం, మినుముకు ఎకరాకు రూ.20,000కు బీమా చేసేందుకు రైతు వాటాగా (0.25 శాతం) రూ.50 ప్రీమియం, శెనగలు ఎకరాకు రూ.30,000కు బీమా చేయటానికి రైతు వాటా (0.25 శాతం) రూ.70 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులందరికి సంబంధిత బ్యాంకులే ప్రీమియంను మినహాయించుకొని బీమా కల్పిస్తాయని, సొంత పెట్టుబడితో సాగు చేస్తున్న రైతులు మాత్రం సంబంధిత గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్లకు వెళ్ళి అవసరమైన డాక్యుమెంట్లు అందించి ప్రీమియం చెల్లించి పంటల బీమాలో నమోదు అవ్వాలన్నారు. నమోదుకు రైతు ఆధార్‌కార్డు, పొలం డాక్యుమెంట్లు, సిసిఆర్‌సి కార్డు, సాగు సర్టిఫికేట్, ఫోన్ నెంబరు, బ్యాంకు పాస్‌బుక్ అందించాలన్నారు. పంటల బీమాలో డిసెంబరు 15వ తేదీ లోపు నమోదు కావల్సి ఉంటుందన్నారు. పంటల బీమాలో నమోదైన రైతులందరూ సాగు చేసిన పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పంటల బీమాకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలపై గ్రామ స్థాయిలో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఉద్యానశాఖ అడిషనల్ డైరక్టర్ బాలజీ నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, సీపీఓ శేషశ్రీ , ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, అసిస్టెంట్ లీడ్ బ్యాంకు మేనేజరు కష్ణారెడ్డి, ఫ్యూచర్ జనరల్ ఇన్స్ రెన్స్ కంపెనీ జిల్లా మేనేజరు దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ

15,16 తేదీల్లో విద్యుత్ రంగంపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

'విద్యుత్ రంగం- నూతన ప్రభుత్వాలు - సవాళ్ళు' అనే అంశంపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్ ఆధ్వర్యంలో నవంబర్ 15, 16 తేదీలలో గుంటూరులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. గురువారం స్థానిక బ్రాడీపేటలోని సిఐటియు నగర కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యుత్ అనేటువంటిది అత్యంత కీలకమైన రంగం అని, ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రవేట్ పరం చేయాలని, స్మార్ట్ మీటర్లు తీసు కొస్తూ కార్మికులకు, ఉద్యోగులకు ఉపాధి పోగొట్టే చర్యలు చేపడు తుందన్నారు. ట్రూ అప్ ఛార్జీలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, స్మార్ట్ మీటర్లు తదితర సమస్యలపై ఈ సదస్సులో చర్చింటం జరుగు తుందన్నారు. యూనియన్ గౌరవా ధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు నేడు అదే స్మార్ట్ మీటర్లను కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించారన్నారు. ప్రభుత్వం విద్యుత్ రంగంపై శ్వేత పత్రం విడుదల చేసినా, దానికి దశా, దిశ లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్తును ప్రజలకు ఎలా అందించాలని అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. గుంటూరులో జరుగుతున్నటువంటి రాష్ట్ర సదస్సుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి పవన్, జి.నాగరాజు, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రవికుమార్, అమరావతి డివిజన్ అధ్యక్షులు టి.వర్మ, నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వవైభవం : మంత్రి సవిత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బ్రాహ్మణులకు వచ్చే ప్రతి రూపాయిని బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారానే వినియోగిస్తామని, కూటమి ప్రభుత్వంలో ఖచ్చితంగా బ్రాహ్మణులకు పూర్వ వైభవం తీసుకువస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. గురువారం గుంటూరు కొత్తపేటలో వున్న యడవల్లి వారి బ్రాహ్మణ ధర్మ సత్రాన్ని మంత్రి ఎస్.సవిత పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. రుణాల మంజూరును అడిగి తెలుసుకున్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ కు చెందిన మూడు ఎకరాలకు పైగా ఖాళీగా ఉన్న స్థలాన్ని బ్రాహ్మణ కార్పొరేషన్ మేనే టజింగ్ డైరెక్టర్ మహేశ్వర రెడ్డి , కార్పొరేషన్ జనరల్ మేనేజర్ నాగసాయి యడవల్లి వారి బ్రాహ్మణ సత్రం కన్వీనర్ సుభద్రలతో కలసి పరిశీలించి వారికి మంత్రి పలు సూచనలు చేశారు. మంత్రి సవిత పాత్రికేయులతో మాట్లా డుతూ సత్రం స్థలాన్ని బ్రాహ్మణుల సంక్షేమా నికే వినియోగిస్తామని పేర్కొన్నారు. 2014 -19 కాలంలో సిఎం చంద్రబాబు అప్పట్లోనే బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి నామినేటెడ్ పోస్టులలో ఒక సీటు బ్రాహ్మణులకు వచ్చేలా చూస్తామన్నారు. గత ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల్లో బ్రాహ్మ ణుల అభ్యున్నతిని విస్మరించి మోసం చేశారన్నారు. గత ప్రభుత్వ హయం లోనే మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కు వగా జరిగాయని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. గత ఐదు సంవత్సరాల్లో డ్రగ్స్ , గంజాయి , మత్తు పదార్థాలు సేవించి దాడులు చేశారని, కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తరువాత మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపారని తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే నిందితులను వెంటనే అరెస్టు చేస్తున్నామని తెలిపారు. మహిళలపై అత్యాచారాలకు సంబంధించి మాజి సిఎం జగన్ వ్యాఖ్యలు ఘోరంగా ఉన్నాయన్నారు. వైసిపి వారి చేతుల్లో నష్ట పోయిన మహిళలను జగన్ ఒక్కసారి అయినా పరామర్శించారా అని ప్రశ్నించారు. మంత్రి వెంట బ్రాహ్మణ చైతన్య వేదిక కన్వీనర్ సిరివరపు శ్రీధర్, సత్రం కన్వీనర్ సుభద్ర తదితరులు ఉన్నారు.



యడవల్లి వారి సత్రం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత